సాక్షి
జనగామ

గురువారం । 30 । మార్చి । 2023



పగిలిన అద్దాలు.. విరిగిన లాఠీ
టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యాన చేపట్టిన మహా ధర్నాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. - 10లో▸



గంజాయి స్మగ్లర్ల అరెస్ట్
ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి తరలించి జిల్లాలో అమ్ముతున్న ఆరుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు డీసీపీ సీతారాం తెలిపారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$38^0/23^0$

వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా.. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
గురు 6:35	శుక్ర 4:49

రంజాన్ వేళలు

యంగ్ సైంటిస్ట్

- విద్యార్థులకు 'ఇస్రో' అవకాశం
- తొమ్మిదో తరగతి విద్యార్థులు అర్హులు
- క్విజ్, 8వ తరగతి మార్కులే ఆధారం..
- ఎంపికైన వారికి 12 రోజుల పాటు ఉచిత శిక్షణ
- ఏప్రిల్ మూడో తేదీ వరకు గడువు



జనగామ రూరల్: విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అవకాశం కల్పిస్తున్నది. పాఠశాల విద్యార్థులకు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం (యువ విజ్ఞాన కార్యక్రమం) నిర్వహిస్తున్నది. అంతరిక్ష శాస్త్రంలో అభివృద్ధి చెందుతున్న ధోరణులు, స్పేస్‌పై ప్రాథమిక జ్ఞానం అందించడానికి కృషి చేస్తున్నది. ఇందుకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించింది. శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు రవాణా చార్జీలు, భోజన వసతులు, ఇతర అన్ని సదుపాయాలు కల్పించనుంది.

ఎంపిక ప్రక్రియ ఇలా..

8వ తరగతిలో పొందిన మార్కులకు 50 శాతం, ఆన్‌లైన్ క్విజ్‌లో 10 శాతం, సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొంటే 10శాతం, ఒలింపియాడ్‌లో ర్యాంక్‌కు 5 శాతం, క్రీడా పోటీలకు 5 శాతం, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌కి 5 శాతం, గ్రామపంచాయతీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 15 శాతం వెయిటేజీతో ఎంపిక ఉంటుంది.

12 రోజుల శిక్షణ

ఎంపికైన విద్యార్థులకు వేసవి సెలవుల్లో మే 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. విద్యార్థి, తల్లిదండ్రులు, గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. అయితే దరఖాస్తును పలు దశల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదట ఈ మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకొని 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఇది పూర్తయిన 60 నిమిషాల్లో యువికా(యువ విజ్ఞాన కార్యక్రమం) పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సమర్పించాలి. అలాగే విద్యార్థి సంతకం, గత మూడేళ్లలో సాధించిన ప్రగతి రిపోర్ట్ పత్రాలు అప్‌లోడ్ చేయాలి.

ఏప్రిల్ 3 వరకు గడువు..

ఆసక్తి ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 3వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. 9వ తేదీ ప్రక్రియ పూర్తి చేసి 10న మొదటి విడత జాబితా ప్రకటించి ఎంపికైన వారికి సమాచారం ఇస్తారు. రెండో విడత 20వ తేదీన ఉంటుంది. మే 14న ఆయా సెంటర్లకు విద్యార్థులు చేరుకుంటారు.

శిక్షణ కేంద్రాలు

ఇస్రో ఆధ్వర్యంలో 12 రోజులు శిక్షణ ఇవ్వడానికి దేశ వ్యాప్తంగా ఏడు సెంటర్లు కేటాయించారు. అందులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ డెహ్రాడూన్, విక్రమ్ సారాబాయి స్పేస్ సెంటర్ తిరువనంతపురం, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట, యూఆర్.రావు శాటిలైట్ సెంటర్ బెంగళూరు, స్పేస్ అప్లికేషన్ సెంటర్ అహ్మదాబాద్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ హైదరాబాద్, నార్త్ ఈస్ట్ స్పేస్ సెంటర్ షిల్లాంగ్ ఉన్నాయి.

బాధ్యత తీసుకోవాలి



ఈ శిక్షణకు అర్హులైన విద్యార్థులను ఎక్కువ మంది ఎంపికయ్యేలా చూడాలి. ఇస్రో పట్ల అవగాహన కల్పించి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, స్పెషల్ ఆఫీసర్లు బాధ్యత తీసుకోవాలి. ప్రతిభ, నిబంధనల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.
- కె.రాము, డీఈఓ

విద్యార్థులను ప్రోత్సహించాలి



బాల మేధావులుగా, శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. యువ విజ్ఞాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా టీచర్లు ప్రోత్సహించాలి.
- గౌసియా బేగం, జిల్లా సైన్స్ అధికారి

వల్మిడి గుట్టపై చలువ పందిళ్లు.. (ఇన్‌సెట్‌లో) శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు





కల్యాణానికి వేళాయె..

- నేడు శ్రీరామనవమి
- వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- వల్మిడిలో రాములోరి కల్యాణ బ్రహ్మోత్సవాలు

శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో నిర్వహించనున్నారు. ఈ వేడుకను భక్తులు తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎండలు పెరిగిన నేపథ్యంలో చలువ పందిళ్లు వేశారు. పాలకుర్తి మండలం వల్మిడిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం(గుట్టపై)లో ఈనెల 30 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు హాజరవుతున్నారు. కల్యాణ క్రతువును వీక్షించేందుకు వచ్చే భక్తులకు భోజన సదుపాయం, అలాగే గుట్టపైకి తరలించడానికి వాహనాలు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రం పాతబీటు బజారులో శ్రీ సీతారామచంద్రస్వామి కమిటీ ఆధ్వర్యంలో 70వ ఏట కల్యాణం నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. అలాగే జనగామ పట్టణంతోపాటు పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల పరిధి ఆలయాల్లో వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- జనగామ

- వివరాలు 11లో▸

న్యూస్‌రీల్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



జనగామ రూరల్: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం జనగామ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, రంజాన్ పండుగలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మత సామరస్యంతో జరుపుకోవాలన్నారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్, హిందు సంఘాలు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి




జనగామ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఫొటోను ఇండియా కరెన్సీపై ముద్రించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు వారు బుధవారం పార్లమెంట్ భవనంలో ఉప రాష్ట్రపతి జగదీప్ దంగల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని, రాజ్యసభ సభ్యులతో పోరాడుతామని అన్నారు. మార్చి 31న జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

పంచాంగం ఆవిష్కరణ



జనగామ రూరల్: బ్రహ్మశ్రీ రాళ్లబండి లంకేశ్వరాచార్య సిద్ధాంతి చేత సూర్యసిద్ధాంతం ఆధారంగా గణించిన శోభకృత్ నామ సంవత్సర వైశ్యకర్మణ్య పంచాంగాన్ని బుధవారం విశ్వబ్రాహ్మణ కవులు, కళాకారులు ఆవిష్కరించారు. పట్టణంలోని పాటు బీటు బజార్‌లోని విశ్వకర్మ స్వర్ణకార సంఘం భవనంతో జరిగిన ఈ కార్యక్రమంలో కవులు సోమేశ్వరాచారి, రామ్మూర్తి, సోమనర్సింహాచారి, శశిధర్, సాయికిరణ్, వేదాస్ జిల్లా బాధ్యులు భాస్కరాచారి, నామేశ్వరాచారి, నర్సింహాచారి, అంజనేయులు పాల్గొన్నారు.

కాయకల్ప బృందం సందర్శన



జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని బుధవారం కాయకల్ప బృందం సందర్శించింది. టీంలోని డాక్టర్లు పూజారి రఘు, రెహమాన్, ఉస్మానియా అసిస్టెంట్ ప్రొఫెసర్ సిస్టర్ స్టెల్లా ఆస్పత్రిలోని శానిటేషన్ తదితర విభాగాలను పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ నిబంధనలకు తగినట్టు ఉన్నాయా లేదా అనే కోణంలో కేటగిరీల వారీగా వివరాలు నమోదు చేసుకున్నారు. వారి వెంట మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు తదితరులున్నారు.

టీపీఓగా వేణుగోపాల్

జనగామ : పట్టణ ప్రణాళిక అధికారిగా వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న రంగు వీరస్వామిని జిల్లా ప్రణాళిక అధికారిగా నియమించిన ప్రభుత్వం.. పూర్తి స్థాయి టీపీఓను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

- వీసీలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీ దేవసేన, ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణపై దృష్టి సారించాలని, విద్యార్థుల కోసం ఉదయం, మధ్యాహ్నం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని చెప్పారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి కలెక్టర్ శివలింగయ్య జిల్లాలో ఏర్పాట్లపై వివరించారు. 6,748 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. 42 సెంటర్లు ఏర్పాటు చేశామని, ఆయా సెంటర్లలో అవసరమైన సదుపాయాలు, సీసీ కెమెరాలు, విద్యుత్ తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 6304062768 నంబర్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వీసీలో డీఈఓ రాము, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాదవ్, డీపీఓ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ రజిత, ఆర్డీఓ శ్రీనివాస్, బి.అర్జున్, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన రోడ్డును అప్పగించాలి

- జీఎంఆర్‌కాలనీ వాసుల ధర్నా



మున్సిపల్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

జనగామ: రూ.లక్షలు పెట్టి ఇళ్లు కట్టుకున్నాం.. కాలనీ రోడ్డును కబ్జా చేశారు.. దారిలేక నరకం చూస్తున్నాం.. అధికారులు పట్టించుకోవడం లేదంటూ జీఎంఆర్‌కాలనీ వాసులు బుధవారం మున్సిపాలిటీ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఆర్‌ఎస్.రెడ్డి, కార్యదర్శి బి.రఘు, కోశాధికారి షర్ఫొద్దీన్, రామచంద్రం, మండి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పలయ్య, నరేష్, అనిల్‌రెడ్డి, మురళి, నర్సింహులు, హరిప్రసాద్ మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం 60 కుటుంబాలు ప్లాట్లు కొనుగోలు చేసి అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నామని చెప్పారు. పలువురు కాలనీకి వచ్చే 50 ఫీట్ల రోడ్డును కబ్జా చేయడంతో ఇరుకుగా ఉన్న 9 ఫీట్ల రోడ్డు వెంట వెళ్లాల్సి వస్తున్నదని అన్నారు. కబ్జాకు గురైన రోడ్డును అప్పగించకపోతే కుటుంబాలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టెన్త్ విద్యార్థులకు 'ఫోన్ ఇన్'

- 31 నుంచి ఏప్రిల్ 11 వరకు స్పెషల్ తరగతులు
- సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక

జనగామ: జిల్లా పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలవాలనే ఉద్దేశంతో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఈనెల 31 నుంచి వచ్చే నెల 11 వరకు జిల్లా స్థాయిలో ఫోన్ ఇన్‌లో స్పెషల్ తరగతులను నిర్వహించనున్నారు. ఇందుకు ప్రతి సబ్జెక్టు నుంచి ఒక్కో ఉపాధ్యాయున్ని ఎంపిక చేశారు. విద్యార్థులు సంబంధిత విషయ నిపుణులకు ఫోన్ చేసి సలహాలు, సూచనలతో పాటు అందులో తెలియని విషయాలను తెలుసుకోవచ్చు. 31వ తేదీ నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమై.. సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఫోన్‌లో అందుబాటులో ఉంటారు.

టీచర్	సబెక్టు	ఫోన్ నంబర్
వి.రమేష్‌బాబు	తెలుగు	9550896914
డి.శేషకుమార్	తెలుగు	9866416849
వజ్రయ్య	హిందీ	9573141365
డి.రాంచంద్రం	హిందీ	9603126602
సమ్యూల్ ఆనంద్	ఇంగ్లిష్	7569714275
కె.శ్రీనివాస్‌రెడ్డి	ఇంగ్లిష్	9866460824
ఎల్ఆర్.అనిత	గణితం	9963334424
ఎ.రవిందర్	గణితం	9908133709
ఆర్ బాలరాజు	ఫిజికల్ సైన్స్	9951253676
పి.శోభన్‌బాబు	ఫిజికల్ సైన్స్	9848539495
టి.పంచాక్షరి	బయాలజి	8555027874
పి.శివప్రసాద్	బయాలజి	9951053400
ఎం.రూన్సీలక్ష్మి	సాంఘికశాస్త్రం	9849868414
ఎం.కనకయ్య	సాంఘిక శాస్త్రం	8074254992

విజయకేతనం చూపిస్తున్న విద్యార్థినులు



ఇంటిబాట పట్టిన విద్యార్థులు







ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- ఇంటిబాట పట్టిన విద్యార్థులు

జనగామ రూరల్: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారంతో ముగియగా హాస్టళ్లు, రెసిడెన్సియల్ కళాశాలల్లోని విద్యార్థులంతా ఇంటిబాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లలో ఈనెల 15 నుంచి మొదలైన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఐఓ శ్రీనివాస్ తెలిపారు. చివరిరోజు పరీక్షకు జనరల్ విభాగం 3,439 మందికి 3,391, ఒకేషనల్ విభాగం 418 మందికి 395 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. జనగామ, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్ కళాశాలలను పరీక్షల కన్వీనర్ శ్రీనివాస్, డెక్ సభ్యులు లలిత, ఆంజనేయరాజు సందర్శించారు. ఇదిలా ఉండగా.. ఈనెల 31, ఏప్రిల్ 1వ తేదీన ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ పరీక్ష ఉందని, ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

శిశువు ప్రాణం తీసిన సాధారణ ప్రసవం!

- జనగామ ఎంసీహెచ్‌లో ఘటన
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఫిర్యాదు





మృతి చెందిన శిశువు, మంత్రికి పంపిన మెసేజ్..

జనగామ రూరల్: సాధారణ ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలి బావ రమేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడకండ్ల మండలం కడగుట్టతండాకు చెందిన జాటోత్ యాకేష్‌కు తిరుమలగిరి మండలం వెలిశాలకు చెందిన కల్పనతో గత ఏడాది వివాహం అయింది. కల్పనను డెలివరీ కోసం ఈనెల 27న జనగామ ఎంసీహెచ్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకురాగా.. ప్రసవానికి సమయం ఉందని పంపించారు. 28న నొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా.. సాధారణ ప్రసవం కోసం వైద్యులు వేచిచూశారు. అదే రాత్రి తీవ్రంగా ఇబ్బంది పడిన కల్పనకు పెద్దాపరేషన్ చేయమని కోరినా డాక్టర్లు పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. 29న నొప్పి ఎక్కువ కావడంతో ఉదయం 10 గంటలకు ఒక ఇంజక్షన్ ఇచ్చి.. మధ్యాహ్నం సాధారణ ప్రసవం చేశారు. తర్వాత శిశువు పరిస్థితి క్రిటికల్‌గా ఉందని అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు పంపించగా.. మార్గ మధ్యలోనే మృతి చెందిందని కన్నీటి పర్యంతమయ్యారు.

మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు

శిశువు మృతి చెందిన విషయమై వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుకు ఫోన్ చేసి చెప్పగా.. అదే సమాచారం మేసేజ్ చేయమని చెప్పారని బాధితురాలి బావ రమేష్ తెలిపాడు. శిశువు మృతికి కారణమైన వారిని శిక్షించాలంటూ రమేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ రఘుపతి పేర్కొన్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యం లేదు..

పాప తల కిందకు జారి మెడకు పేగు చుట్టుకోవడం వల్లే ఇలా జరిగింది. ఆ సమయంలో పెద్ద ఆపరేషన్ చేయడం కుదరదు. డాక్టర్ల నిర్లక్ష్యం ఏమీలేదు. పాప జన్మించిన కొద్ది సెకండ్ల పాటు ఏడ్చింది.

- డాక్టర్ సుగుణాకర్‌రాజు, మెడికల్ సూపరింటెండెంట్

రాహుల్ 'సభ్యత్వం' రద్దుపై నిరసన



నిరసన కార్యక్రమంలో ప్రవీణ్, తదితరులు

జనగామ: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోక్కుంట్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదాని, ప్రధాని మోదీ మధ్య ఉన్న చీకటి స్నేహం బయటపడుతుందనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని, దీనిని ప్రజాస్వామ్య చరిత్రలో చీకటిరోజుగా పరిగణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పులి గణేష్‌గౌడ్, నాయకులు అల్లం ప్రదీప్‌రెడ్డి, కొన్నె మహేందర్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, ఈర్ల లక్ష్మణ్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణస్వామి, పట్వారి శ్రీనివాస్, రంగు రవి, మాజీద్, పిట్టల సతీస్, వెంకటేశ్‌యాదవ్, తిరుపతి, శేఖర్‌గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలి

- డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి
- మెడికల్ కళాశాలపై కలెక్టర్‌తో కలిసి సమీక్ష
- నిర్వహణకు డిగ్రీ కళాశాల నిరాకరణ..?
- నెలరోజుల సమయం ఇచ్చిన అధికారులు
- సమయానికి కొత్త భవనం పూర్తయ్యేనా..!



మెడికల్ కళాశాలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంఈ రమేష్, పక్కన కలెక్టర్ తదితరులు

జనగామ: వచ్చే విద్యాసంవత్సరం నుంచి జనగామ మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యతో కలిసి బుధవారం మెడికల్ విద్యార్థులకు అవసరమయ్యే వసతి సౌకర్యాలతో పాటు తరగతి గదులు, కనీస మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ కళాశాల నిర్మాణానికి 22 ఎకరాల స్థలంతోపాటు ఫస్టియర్ తరగతులు ప్రారంభించేందుకు వంద సీట్లు కేటాయించినట్లు చెప్పారు. నూతన భవనం పూర్తయ్యే వరకు తరగతులు నిర్వహించడానికి పట్టణంలోని ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ, పీజీ కళాశాల, ధర్మకంచలోని వసతి గృహం, పెంబర్తిలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల వీబీఐటీ, గీతాంజలి పాఠశాల, చంపక్ హిల్స్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో(నిర్మాణంలో ఉన్న) భవనాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. వీటిలో విద్యార్థులకు అనుకూలంగా ఉన్న భవనాలను తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. తరగతులు ప్రారంభమయ్యే లోపు నూతన భవనం పూర్తి కావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు, ఇంజనీర్ అధికారి దేవేందర్, తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలకు నిరాకరణ..?

మెడికల్ కళాశాల నూతన భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ఫస్టియర్ తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలను ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి అక్కడ బోర్డు సైతం ఏర్పాటు చేసిన అధికారులు.. తరగతులు ఇక్కడే జరుగుతాయని ఇటీవల వెల్లడించడంతో పాటు స్టేట్‌కు నివేదిక పంపించినట్లు తెలిసింది. ఇటీవల ఢిల్లీ నుంచి వచ్చిన బృందం డిగ్రీ కళాశాలను పరిశీలించింది. అయితే డీఎంఈ రమేష్‌రెడ్డి రాక నేపథ్యంలో సందిగ్ధత నెలకొన్నట్లు తెలిసింది. డిగ్రీ కళాశాల విద్యార్థులకు పక్కనే ఉన్న పీజీ కళాశాల లేదా అందులోనే కొన్ని తరగతులను కేటాయిస్తామని చెప్పగా.. వారు అందుకు నిరాకరించినట్టు సమాచారం. ప్రైవేట్ భవనాలను తీసుకుందామని జిల్లా అధికారులు సూచించగా.. ఎక్కడ కూడా అద్దెకు తీసుకునే అవకాశం లేదని పేర్కొనట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వ భవనాల కేటాయింపునకు సంబంధించి నెలరోజుల్లో ఏదో ఒక్కటి తేల్చాలని డీఎంఈ సూచించినట్టు సమాచారం. అయితే చంపక్‌హిల్స్ ఎంసీహెచ్ ఆవరణలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఒకే వేళ నూతన భవనం పూర్తి కాక.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇచ్చేందుకు అంగీకరించని పక్షంలో.. వచ్చే ఏడాది మెడికల్ కళాశాల ప్రారంభం పరిస్థితి ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డిగ్రీ కళాశాల బోర్డుకు ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల బోర్డు ఫ్లెక్సీని తొలగించారు. దీనిపై ఎలాంటి సంకేతాలు వస్తాయో వేచి చూడాలి.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ పీహెచ్‌సీ పరిధి కంటి వెలుగు క్యాంపును ఆయన సందర్శించారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడిన ఆయన.. క్యాంపుల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవీందర్, సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు, డాక్టర్ భాస్కర్, సుధీర్, అశోక్‌కుమార్ ఉన్నారు.





పగిలిన అద్దాలు.. విరిగిన లారీ

- కేయూలో ఉద్రిక్తత
- మహాధర్నా ర్యాలీ, పేపర్ లీకేజీపై ఆగ్రహం
- సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లేయత్నం
- పోలీసుల లాఠీచార్జ్, విద్యార్థి నాయకుడి తలకు గాయం
- విద్యార్థి జేఏసీ నాయకుల అరెస్ట్


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు


పోలీసులను అడ్డుకుంటున్న నిరసనకారులు

కేయూ క్యాంపస్: పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, వెంటనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని లైబ్రరీ ఎదుట నిర్వహించిన మహాధర్నా ఉద్రిక్తతకు చోటు చేసుకుంది. నిరుద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కేయూలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను నిర్వహిస్తామని కేయూ విద్యార్థి జేఏసీ అనుమతి కోరితే వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి పరిపాలనా భవనంవైపు రాగా పోలీసులు భారీ బందోబస్తుతో పరిపాలన భవనం రెండు గేట్లను మూసివేయడంతో రెండో గేటు వైపు ర్యాలీ నిర్వహించారు. రెండో గేటు కూడా మూసివేయడంతో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మళ్లీ పరిపాలన భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వాలని, వెంటనే వీసీ బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. సంఘర్షణ సభకు వీసీ రమేశ్ అనుమతి ఇస్తే మేము శాంతియుతంగా వెళ్లి పోతామని విద్యార్థి జేఏసీ నాయకులు పోలీసులను కోరారు. అయినా వీసీ రాకపోవడంతో పరిపాలనా భవనంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. అప్పటికే ప్రధాన ద్వారం వద్ద మోహరించి ఉన్న పోలీసులు వీరిని అడ్డుకోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ప్రధాన ద్వారం వద్ద పలు అద్దాలు పగిలిపోయాయి. దీంతో పోలీసులు విద్యార్థి నాయకులపై లాఠీచార్జ్ చేశారు. దీంతో విద్యార్థినాయకులు కొన్ని పూలకుండీలను పగులగొట్టారు. మరోవైపు ఇద్దరు విద్యార్థి నాయకులు పరిపాలన భవనం ఎక్కి తమ నిరసన తెలిపారు. అక్కడి నుంచి దూకుతారని భావించిన పోలీసులు వారిని కిందకు దించివేశారు.


పూలకుండీ పగులగొడుతున్న విద్యార్థి

మరికొందరు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు లాక్కునే యత్నం చేయడంతో విద్యార్థి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకుడు మేడ రంజిత్ తలకు గాయం అయింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కేయూ విద్యార్థి జేఏసీ

రాష్ట్రంలోని 35 లక్షల నిరుద్యోగుల భవిష్యత్‌ను అంగట్లో పెట్టారని కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు పెట్టి ప్రిపేర్ అయితే గ్రూప్ 1, తదితర పేపర్ల లీకేజీలతో వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో ఢిల్లీలో ఈడీ విచారణను ఎదుర్కొంటుంటే ప్రజలను, నిరుద్యోగులను గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీలో తిష్ట వేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌ఖన్నా, కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎస్‌యూఐ బాధ్యులు అలువాల కార్తీక్, రాకేష్, కృష్ణ, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, కళ్లేపెల్లి ప్రశాంత్, కామగోని శ్రవణ్, వంశీకృష్ణ, బి నర్సింహారావు, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, జేఏసీ నాయకులు రంజిత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూ బంద్‌కు పిలుపు

విద్యార్థి నాయకులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ నేడు (గురువారం) కేయూ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ తెలిపారు. విద్యార్థినాయకుల అరెస్టును నిరసిస్తూ కేయూలో నిరసన తెలిపారు.

ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్న వీసీ రమేశ్



సంఘర్షణ సభకు అనుమతి ఇవ్వకుండా వీసీ ఆచార్య రమేశ్ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన 30 లక్షల మంది నిరుద్యోగుల నియామకాలపై నమ్మకం కలగాలంటే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను బర్తరఫ్ చేయాలి. పేపర్ లీకేజీని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి.

– తిరుపతి యాదవ్, కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం..



ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుంది. పేపల్ లీకేజీపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కేసీఆర్ ప్రభుత్వం బాధ్యత వహించాలి. సంఘర్షణ సభకు వీసీ అనుమతి ఇవ్వకపోవడం శోచనీయం.

– మేడ రంజిత్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

13మందిపై కేసు

వీసీ ఆచార్య రమేశ్ ఫిర్యాదు మేరకు 13 మంది విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా హనుమకొండ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విద్యార్థి నాయకులను పరామర్శించారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ: ఏపీ, ఒరిస్సా రాష్ట్రాల నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ జిల్లాలో అమ్మకాలు చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి. సీతారాం తెలిపారు. బుధవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై ఎస్‌కె జానీపాషాతో కలిసి వివరాలు వెల్లడించారు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన కూకట్ల నిశాంత్, గోవిందరాజుల గుట్టకు చెందిన బొల్లి లక్ష్మణ్, భూపాలపల్లికి చెందిన మహ్మద్ అజహర్, తొగరి నిఖిల్, తొర్రూరు మండలం మడిపల్లికి చెందిన సిరబోయిన కృష్ణ, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన చీకటి కిరణ్‌లు కలిసి రెండు రాష్ట్రాల మీదుగా వరంగల్, జనగామ ప్రాంతాలకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారు. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌తో కలిసి నిశాంత్ గంజాయి అమ్మకాలు చేసే వారు. ఇటీవల జలీల్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లడంతో బుల్లి లక్ష్మణ్, అజహర్‌తో కలిసి నిశాంత్ సులభతరంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గంజాయి సప్లయ్ చేస్తున్నారు. నెల్లికుదురుకు చెందిన కృష్ణమూర్తి, కిరణ్‌పై వరంగల్, మహబూబాబాద్, ఖమ్మంలో గంజాయి కేసులు నమోదు కావడంతో పోలీసుల కళ్లు కప్పి వారి మకాం జనగామకు మార్చుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు నర్మెట మండల కేంద్రం హెచ్‌పీ, ఏసర్ పెట్రోలు బంకులు, దుర్గమ్మ ఆలయం సమీపంలో పోలీసులు వేర్వేరుగా తనిఖీలు చేపట్టగా వాహనాలపై వెళ్తున్న ఆరుగురు వ్యక్తులపై అనుమానం వచ్చి తనిఖీలు చేయగా వీరి నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే ఆరు కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న సీఐ నాగబాబు, ఎస్సై జానీపాషా, హెడ్ కానిస్టేబుల్ గట్టయ్య, కానిస్టేబుళ్లు ధనుంజయ్, ప్రవీణ్, రహమత్‌అలీ, హమీద్, రాజు, రమేష్, గాలిబ్‌లను డీసీపీ అభినందించారు.





వసంతోత్సవానికి వేళాయె

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- నిట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో స్ప్రింగ్‌స్ప్రీ–23
- ప్రారంభోత్సవంలో పాల్గొననున్న పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్


కళాధ్వనిని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ రమణారావు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులచే నిర్వాహకులుగా మూడు రోజుల వసంతోత్సవ సంబురం, సంస్కృతి సంప్రదాయాలను పంచుకునే వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ–23 ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. నిత్యం విద్యతో కుస్తీ పడుతూ ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్న నిట్ విద్యార్థులు తోటి విద్యార్థులతో పాటు దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో ఆ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలను, మన సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకుంటూ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌గా ఏర్పాటు చేసుకుని మూడు రోజుల వేడుకకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 20వేల మంది విద్యార్థులు ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ వేడుకల్లో పాల్గొననున్నారు. ఇది దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్‌గా నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ నిలుస్తుంది.

ప్రతి ఏడాది ప్రత్యేక థీంతో..

నిట్ వరంగల్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ వసంతోత్సవ వేడుకలకు ప్రత్యేక థీంను రూపొందిస్తారు. ఈ ఏడాది స్ప్రింగ్‌స్ప్రీ–23కి కళాధ్వనిగా నామకరణం చేశారు. 2019లో కళాక్షేత్ర, 2020లో మితియాస్, 2022లో సృష్టి, 2023లో కళాధ్వనిగా నామకరణం చేశారు.

55కు పైగా ఈవెంట్స్..

ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనిలో 55కు పైగా ఈవెంట్స్‌తో అలరించనుంది. తొలిరోజు 7న టాలీవుడ్‌నైట్ పేరిట టాలీవుడ్ సింగర్స్ నిట్ మైదానంలో అలరించనున్నారు. రెండో రోజు 8న డీజే నైట్, సన్‌బర్న్ పేరిట డీజేలు వివిధ రకాల పాటలతో అలరించనున్నారు, మూడో రోజు 9న బాలీవుడ్ నైట్ పేరిట బాలీవుడ్ సింగర్స్ ఉర్రూతలూగించనున్నారు. వీటితో పాటు మూడురోజుల పాటు ప్రా షోలు, స్పాట్ లైట్స్, స్యాండ్ ఆర్ట్, సైలెంట్ డీజేస్, మాస్టర్ చెఫ్, జుంబాడ్యాన్స్, కొరియో నైట్, వార్ ఆఫ్ డీజేస్, ఐడల్, అల్యూర్‌లతో వసంతోత్సవం కలర్ ఫుల్‌గా సాగనుంది.

ప్రారంభోత్సవానికి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్



నిట్ వరంగల్ స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏప్రిల్ 6న ముఖ్యఅతిథిగా పాల్గొని స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలను నిట్ మైదానంలో ప్రారంభించనున్నారు. పవన్ కల్యాణ్‌ను చూసేందుకు నిట్ వరంగల్ విద్యార్థులతో పాటు ఓరుగల్లు వాసులు ఎదురుచూస్తున్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎంట్రీ పాసుల కోసం ఇప్పటికే క్రేజ్ మొదలైంది. స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లను నిట్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌లో క్యూఆర్‌కోడ్‌లతో అందజేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని

నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న మూడు రోజుల స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనిని ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో వేడుకలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. బుధవారం నిట్‌లోని సుభాష్‌చంద్రబోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు, సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం పంచుకునేందుకు స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలు విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్నారు. రెండు నెలల పాటు 200 మంది విద్యార్థులు నిట్‌లోని వివిధ క్లబ్స్‌తో మమేకమై కోర్‌టీంలుగా ఏర్పడి ఈ వేడుకలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, కోర్ టీం వంశీకిషోర్, అజయ్‌కుమార్, పీయూష్‌కుమార్, సాయిగురునాథ్ పాల్గొన్నారు.

తెల్లారిన బతుకులు

- కూలీల ఆటోపైకి దూసుకొచ్చిన కారు
- ఇద్దరు కూలీలు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- పరకాల చలివాగు వద్ద ఘటన


కారు ఢీకొనడంతో తీవ్రగాయాలైన కూలీలు


చేరాలు (ఫైల్)


దుబాసి కోమల (ఫైల్)

పరకాల: కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం ఇద్దరు కూలీలను పొట్టనపెట్టుకోగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని చలివాగు వంతెన శివారులో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు అదే గ్రామానికి చెందిన మద్దెబోయిన సందీప్‌కు చెందిన ఆటోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు మిర్చి తోట ఏరటానికి బుధవారం తెల్లవారుజామున బయలుదేరారు. పరకాల చలివాగు వంతెన సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా దూసుకొచ్చిన కారు ఆటో కుడివైపు ఢీకొని ముళ్లపొదళ్లలో పడిపోయింది. దీంతో ఒక్కసారిగా ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలంతా ఎగిరిపడి తీవ్ర గాయాలయ్యాయి. కుడివైపు కూర్చున్న కొంగరి చేరాలు(57), దుబాసి కోమల (56)కు తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరు సిలువేరు కొంరమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తీవ్ర గాయాలైన పసుల భిక్షపతి, దుబాసి సూరమ్మ, కొంగరి లక్ష్మీ, సాలికి స్వరూపలు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు.

పోలీసుల మానవత్వం

రోడ్డు ప్రమాదంలో కూలీలకు తీవ్రగాయాలైన సమాచారం తెలియగానే పరకాల సీఐ పుల్యాల కిషన్, ఎస్సై ప్రశాంత్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రక్తం మడుగులో ఉన్న కూలీలను ఎత్తుకొని 108లో ఆస్పత్రికి తరలించారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మహారాష్ట్రలోని సిరొంచ మండలం ఆసరవెల్లి గ్రామానికి చెందిన గుండు తేజపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.







కలుషిత నీరు తాగి కూలీలకు అస్వస్థత


వాంతులు చేసుకుంటున్న కూలీలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో మిర్చి తోటలోకి కూలి పనులకు వెళ్లిన 25 మంది కూలీలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన 25 మంది కూలీలు గ్రామ సమీపంలోని మిర్చి తోటలో కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో కూలీలు భోజనం చేసిన అనంతరం డ్రిప్ పైప్ నుంచి వచ్చే నీటిని తాగారు. అయితే డ్రిప్ పైపులు శుభ్రం చేసేందుకు రైతులు ఓ ద్రావకాన్ని వదిలారు. ఆ విషయం తెలియని కూలీలు నీరు తాగడంతో వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. గమనించిన గ్రామస్తులు ఆటో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.